అందని 'సర్వే' వేతనాలు

- సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి ఎనిమిది నెలలు
- ఇప్పటికీ సిబ్బందికి చెల్లించని నగదు


పిడిసిల్లలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సునీత (ఫైల్)

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను గతేడాది నవంబర్‌లో ప్రారంభించి డిసెంబర్ వరకు పూర్తి చేసింది. సర్వేలో పాల్గొని విజయవంతం అవడానికి కృషి చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు మాత్రం ఇప్పటి వరకు గౌరవ వేతనం అందలేదు. దీంతో వారు సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సర్వేలో భాగంగా మొదటి మూడు రోజులు వివిధ శాఖల ప్రభుత్వ, ఒప్పంద ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరుగుతూ స్టిక్కర్లు అంటించి కుటుంబాలను గుర్తించారు. అనంతరం ప్రతీ కుటుంబాన్ని కలుస్తూ 75 రకాల ప్రశ్నలకు సమాధానాలు సేకరించి సర్వే చేశారు. సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాలు, ఒక మున్సిపాలిటీ పరిధిలోని డేటా ఎంట్రీకి ప్రభుత్వ ఆపరేటర్లతో పాటు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగ యువతను సైతం వినియోగించుకున్నారు. ఒక్కో ఎన్యూమరేటరకు రూ.10వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12వేలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక కుటుంబం డేటా ఎంట్రీ చేసినందుకు రూ.30 పారితోషికం చెల్లిస్తామని అధికారులు తెలిపారు. సర్వే పూర్తి కాగానే గౌరవ వేతనం సొమ్మును కలెక్టర్ ఖాతాకు జమ చేసి, సంబంధిత సిబ్బందికి అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఎనిమిది నెలలవుతున్నా ఇప్పటి వరకూ చెల్లించలేదు. గతంలో అన్ని జిల్లాల డీడీఓల ఖాతాలకు నిధులు జమ చేసినట్లు ఉత్తర్వులు సైతం విడుదల చేశారని, ఆ డబ్బులు ఏమయ్యాయని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలను చెల్లించాలని కోరుతున్నారు.

గౌరవ వేతనం అందించలేదు



నిర్ణీత సమయంలో పని పూర్తి చేసినా గౌరవ వేతనం ప్రభుత్వం అందించలేదు. చాలా ఓర్పుతో అనేక బాధల కోర్చి, పూర్తి వివరాలు సేకరించి బాధ్యతలు నిర్వహించాం. అధికారులకు తమ సమస్య విన్నవించినా పట్టించుకోవడం లేదు.

- వైనాల శివకుమార్, ఇస్సిపేట, ఎన్యూమరేటర్

ఇబ్బంది పడుతున్నాం..



సమగ్ర కుటుంబసర్వేలో వచ్చిన డాటాను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేశా. కానీ ఇప్పటివరకు డబ్బులు రాలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే నగదు విడుదల చేయాలి.

- శిరీష, ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్

మండలాల వారీగా సర్వేలో పాల్గొన్న సిబ్బంది

మండలం	ఆపరేటర్ల సంఖ్య	ఎన్యూమరేటర్లు	సూపర్‌వైజర్లు
భూపాలపల్లి	69	99	11
గణపురం	88	109	10
రేగొండ	38	97	13
కొత్తపల్లిగోరి	29	47	8
మొగుళ్లపల్లి	61	80	9
చిట్యాల	70	84	9
టేకుమట్ల	45	50	6
కాటారం	57	89	10
మహదేవపూర్	66	75	8
మహాముత్తారం	32	62	7
పలిమెల	9	19	4
మల్హర్	52	70	7

క్లుప్తంగా

సీపీఐ మండల కార్యదర్శిగా రవి


పెంట రవి

రేగొండ: సీపీఐ మండల కార్యదర్శిగా పెంట రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా సహాయ కార్యదర్శి పైల్ల శాంతికుమార్ సోమవారం తెలిపారు. అలాగే మండల సహాయ కార్యదర్శులుగా గుర్రాల రవీందర్, జములాపురం బాబురావును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. పేద బడుగు, బలహీన వర్గాల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

భవిత సెంటర్ ప్రారంభం



టేకుమట్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భవిత సెంటర్‌ను ఎంఈఓ సుధాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెవిటి, మూగ, అంధ, ఇతర వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులకు భవిత కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ద్వారా విద్యను అందించబడుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ప్రతీ సోమవారం నుంచి శుక్రవారం వరకు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ చిక్కుల నరేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

వాజేడు: మండల పరిధిలోని టేకులగూడెం గ్రామంలో సోమవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. పేరూరు వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామ పంచాయతీల సమన్వయంతో గ్రామంలోని అన్ని ఇళ్లల్లో దోమల నివారణ మందును పిచికారీ చేసినట్లు హెచ్‌ఈఓ వేణుగోపాల కృష్ణ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బందం రవీందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న జయప్రద

చిట్యాల: మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో జీపీ సిబ్బంది, ఉద్యోగులు కలిసి బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించి 50 కిలోల బియ్యంతో పాటు రూ.5వేలు విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి అజీర బేగం, ఉపాధ్యాయుడు దశరథం, అంగన్‌వాడీ టీచర్లు కవిత, రజిత, ఆయా శోభ, సీఏ రాజయ్య, బీపీఎం రామకృష్ణ, జీపీ సిబ్బంది రాణి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలి

ఏటూరునాగారం: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. గ్రామంలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ ఇచ్చినందుకు మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌ల చిత్రపటాలకు ప్రజలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఖలీల్, లాలయ్య, నర్సింహరావు, ఎల్లయ్య ఉన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


భూపాలపల్లి రూరల్: సాంబయ్య దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం భూపాలపల్లి ఆర్టీసీ బస్సు డిపోలో గణపురం మండలం కర్కపల్లిగ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ అంబాల సాంబయ్య పదవీ విరమణ సన్మాన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని సాంబయ్య దంపతులను సన్మానించారు. డిపో మేనేజర్ ఇందు, ఆర్‌టీఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, నాయకులు అంబాల శ్రీనివాస్, అప్పం కిషన్, తోట సంతోష్ పాల్గొన్నారు.

చిట్యాల: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం అని ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ అన్నారు. సోమవారం మండలంలోని నైన్‌పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు బాగనారపు రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రమేష్‌ను పూలమాలతో శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు. ఉపాధ్యాయులు సుధాకర్, ప్రవీణ్ కుమార్, రాజయ్య, రఘు ప్రసాద్, నాగరాజు, శ్రీనివాస్, కోటేశ్వర్, విజయవర్ధన్‌రెడ్డి, రఘునాథ్, తిరుపతయ్య ,శ్యాంసుందర్, సదానందం, హసీనా, రాజేష్, ఓదెలు, తిరుపతి, నరేష్ పాల్గొన్నారు.

జెన్‌కోలో పర్మనెంట్ ఉద్యోగాలు కల్పించాలి


సీఈకి వినతిపత్రం ఇస్తున్న రవి

మల్హర్: బొగ్గు గని ఏర్పాటు నేపథ్యంలో మండలంలోని తాడిచర్ల, కాపురం గ్రామాల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు జెన్‌కోలో పర్మనెంట్ ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ.. భూపాలపల్లి జెన్‌కో సీఈ ప్రకాశ్‌కు సోమవారం భూ నిర్వాసితుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. బొగ్గు గని ఏర్పాటుకు జెన్‌కో సంస్థకు భూములు అప్పగించిన రైతులకు జెన్‌కో సంస్థలో రెగ్యూలర్ ఉద్యోగాలు కల్పిస్తామని ఒప్పందం చేశారని పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం కుటుంబంలో ఒక్కరికి జెన్‌కోలో పర్మనెంట్ ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ప్రధాన కార్యదర్శి తాండ్ర సంతోష్ ఉన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపులో నిర్లక్ష్యం


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి/ములుగు రూరల్: మండలంలోని కాటాపూర్‌లోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ దివాకర్ టీఎస్‌కు వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం కాటాపూర్‌లోని 108 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు అర్హులను ఎంపిక చేసి స్థలాలకు పట్టాలు జారీ చేసిన అధికారులు స్థలం కేటాయింపులో జాప్యం చేస్తున్నారన్నారు. పట్టాలు ఇచ్చిన అధికారులు స్థలాలు కేటాయించకుండా ఇబ్బందులను గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా లబ్ధిదారులకు స్థలాలను కేటాయించే విధంగా కలెక్టర్ చర్య తీసుకోవాలని కోరారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దిడ్డి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ గౌరమ్మ, నాయకులు దనూక నర్సింగారావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


దీక్షలో పాల్గొన్న ఉద్యమకారులు


కాళేశ్వరంలో..

మల్హర్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రం తాడిచర్ల హనుమాన్ సెంటర్‌లో తెలంగాణ ఉద్యమకారులు శాంతియుత దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ నియమించాలని, జార్ఖండ్ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ దీక్షా శిబిరంలో బీజేపీ మంథని అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, మండల అధ్యక్షుడు బూడిద సతీష్, ప్రధాన కార్యదర్శి బండారి శంకరయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ చాంద్ పాషా, వెంకటస్వామి, సారయ్య, రాజు, కిష్టయ్య, సమ్మక్క, యశోద, పద్మ, రాజేశ్వరి, విజయ, నగేష్ పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహాదేవపూర్ మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం ఆవరణలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం–టఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉద్యమకారుల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని సోమవారం శాంతి యుత దీక్ష నిర్వహించారు. ఉద్యమకారుల దీక్షలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని తమ పూర్తి సంఘీభావం తెలిపారు. టఫ్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు ఆయూబొద్దీన్, జిల్లా అధికార ప్రతినిధి ఎండీ అక్రమొద్దీన్, మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, నాయకులు ఆన్కారి ప్రభాకర్, జాడి గట్టయ్య, మెసినేని వెంకటేశ్వర్‌రావు, చాగర్ల రవీందర్ తదితరులు ఉన్నారు.

కాలినడకన కాళేశ్వరాలయానికి..


కాళేశ్వరానికి వచ్చిన సాధువు

కాళేశ్వరం: గుజరాత్‌లోని శ్రీరామ్ బల్బ కుటీర్ నర్మాదేశ్వర్ మహాదేవ్ ఆశ్రమం నుంచి ఓ సాధువు గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శిస్తూ కాలినడకన ప్రయాణం సాగిస్తున్నాడు. ఈ మేరకు సోమవారం కాళేశ్వరాలయానికి చేరుకున్నాడు. త్రివేణి సంగమ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి నదికి ప్రత్యేక పూజలు చేశాడు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వరుని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నాడు. నాలుగు నెలల నుంచి కాలినడకన ఆలయాలను సందర్శిస్తున్నట్లు పేర్కొన్నాడు.

కమిటీ ఎన్నిక


నూతన కమిటీతో నాయకులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాకలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి తెలిపారు. అధ్యక్షుడిగా కంకణాల శంకర్, ప్రధాన కార్యదర్శిగా జంగా కుమార్, ఉపాధ్యక్షులుగా పెండెల భిక్షపతి, నూక వీరన్న, యాదండ్ల మహేష్, సహాయ కార్యదర్శిగా గొడుగు సతీష్, పేరుక రాములు, రమేష్, కోశాధికారిగా చిన్నాల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్లబోయిన శివకుమార్, ప్రచార కార్యదర్శిగా కవటి అజయ్, గౌరవ అధ్యక్షుడుగా నల్లబెల్లి శ్రీనివాస్, అలాగే కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు నక్క భాస్కర్, మారెల్ల దేవేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


రేపాకలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

రేగొండ: మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మండల తిరుపతి తల్లి ఆగమ్మ మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం పరామర్శించి ఆగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే ఇటీవల రేపాక గ్రామానికి చెందిన బోయిని తిరుపతి రాజ్ ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బావిలో పడి మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పుల్లూరి బాబురావు, వీరబ్రహ్మం, అమ్ముల సదయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల మండల కేంద్రానికి చెందిన చింతకింది రాజమణి, తిరుమలపూర్ గ్రామానికి చెందిన కంచర్ల పోషాలు, నవాబుపేట గ్రామానికి చెందిన హకీమ్, కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మె


గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏరియాలోని కేటీకే 6వ గనిలో సోమవారం ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. సింగరేణిలో 44 కార్మిక హక్కులను నాలుగు కోడ్‌లుగా విభజించిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, గోవర్ధన్, రాంబాబు, గణేష్, బాలాజీ, బ్రహ్మాచారి, శ్రీనివాస్, చంద్రయ్య, వెంకటస్వామి, నవీన్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

దేశ వ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్‌ను సీఐటీయూ నాయకులు ఏరియాలోని కేటీకే 5వ గనిలో ఆవిష్కరించారు. సీఐటీయూ బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మొండయ్య

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ మొండయ్య పదవీ విరమణ సందర్భంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్, కంపాక్స్ బాక్స్‌లు, అంగన్‌వాడీ పిల్లలకు ప్లేట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు వేణు, వరప్రసాద్, సుధాకర్, సతీష్, సదయ్య, రమేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

బురదమయంగా రహదారి


దిగబడిన లారీని బయటకు తీస్తున్న జేసీబీలు


బురదలో దిగబడిన వాహనాలు

రేగొండ: ఓ పక్క బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా ఆదివారం కురిసిన వర్షంతో రోడ్డు బురదమయంగా మారింది. కొత్తపల్లిగోరి మండలంలోని జమ్‌షేడ్‌బేగ్‌పేట వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండగా రోడ్డు బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఇటీవల ఈ రోడ్డుపై మట్టి పోశారు. వర్షానికి రోడ్డు బురదమయం కావడంతో ద్విచక్ర వాహనదారులు జారి పడిపోతున్నారు. సోమవారం ఉదయం ఓ లారీ బురదలో దిగబడటంతో రెండు జేసీబీల సహాయంతో బయటికి లాగారు. దీంతో రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం మరో వాహనం దిగబడటంతో దారెంబడి వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి బీటీ వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మంగపేట: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి తరుణ్


వెంకటాపురం(ఎం): నర్సాపూర్‌లో..

- వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్

వెంకటాపురం(ఎం): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్, నర్సాపూర్, రాజేశ్వర్‌రావుపల్లి గ్రామాల్లో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల్లో 284 మందిని పరీక్షించి 15 మంది జ్వర పీడితులను గుర్తించి వారికి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మంగపేట: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. మండలంలోని మల్లూరు ఎస్సీ కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని 45 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న ఏడుగురికి రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

చెరుపల్లిలో..

మంగపేట పీహెచ్‌సీ పరిధిలోని చెరుపల్లి(కొత్తపేట)లో వైద్యాధికారి గోపగాని తరుణ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న ఇద్దరికి ఆర్‌డీటీ టెస్టు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

పులి కాదు.. హైనా


పత్తి చేనులో ఉన్న హైనా పాదముద్రలు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి, కొయ్యూరు పరిసార ప్రాంతంలోని పత్తి చేనులో సోమవారం రైతులు అటవీ జంతువు పాద ముద్రలను గుర్తించారు. ఈ క్రమంలో గ్రామంలో మళ్లీ పులి సంచరిస్తుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడికి వచ్చి పాదముద్రలను పరిశీలించారు. అవి పులి పాదముద్రలు కాదని హైనా పాదముద్రలను నిర్ధారించారు. ప్రజలు భయపడొద్దని తెలిపారు.